


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

17

(జూలై 03,'76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"అమ్మా! అమ్మా నే సినిమాకు వెడుతున్నా".**

"ఏం సినిమారా? రోజూ అదే పనా? నీ దగ్గర డబ్బులుంటే ఒక్క రూపాయి ఇయ్యి. అర్జంటు పని వచ్చింది."

"మన బడ్జెట్ చాలా లోటమ్మ. ఇవ్వాళ టిక్కెట్టు డబ్బులు బొటాబొటి - డ్రింకుకు స్వస్తి. "

"ఏం సినిమారా ఒక్క రూపాయి కావాలిరా. మీనాన్న రాగానే తీసుకుని ఇస్తారా."

"నాన్న ఉన్నాడుగా నీకు కాషియర్. మధ్య నన్ను బాధపెడతావెందుకమ్మా. టైం అయింది. నా వంతు భోజనం టేబుల్ మీద పెట్టు. టా...టా"

"అంత గొప్ప సినిమా వచ్చిందేమిట్రా ఒక్కరోజు ఆగలేవు. "

"లేదమ్మా సినిమా చూడకపోతే శివుడికి కోపం వస్తుంది. మూడో కన్ను తెరుస్తాడు. "

"బాగానే ఉంది నీ ధోరణి. అసలేమిటా సినిమా. పోనీ రెండో ఆటకు నే కూడా వస్తాలే. అది పురాణమా! సాంఘికమా! జానపదమా!

***<u>నాంచారయ్య సమర్పించు నా అంతవాణ్ణి నేను</u>***

"నా అంతవాణ్ణి నేను.. "

"నీ అంతవాడని నువ్వేలేరా. అయినా నా కడుపున పుట్టావు కద్రా."

"అదే పొరపాటు. అయినా ఏం చేస్తాం? మరిచిపోతల్లీ ఆ వృత్తాంతం."

"మరిచిపోకేం చేస్తాను. నీ అంతవాడివి నువ్వంటున్నావుగా.!? "

"అవును మాతా ఈ రోజుల్లో ఎవడంత వాడు వాడే ఒకళ్ళతో పోలిక లేదు. ఇది నవయుగం. అందుకే నాంచారయ్య సమర్పించు 'నా అంతవాణ్ణి నేను' సినిమాకు వెడుతున్నా."

"మీ అంతవాళ్ళు మీరు కావాలి నాయనా. మా అంతవాళ్ళుగా ఎందుక్కావాలి.? నీ అంతవాడివి నువ్వయి నీ సంతానం నీకంటే గొప్పదై. "

"సంతానం మాట ఎత్తకమ్మా. చాలా డేంజర్ మరో పదేళ్ళలో జనాభా రెండింతలవుతోందని పత్రికల్లో అంత అంత అక్షరాలతో అచ్చువేస్తున్నారు. చూడటంలా. నా సతానం మాట ఎత్తుతావేమిటమ్మ. ఈ బాల బీష్మ ఇలా బ్రతకనియ్యమ్మ."

**మానవులంతా ఒకటే కుటుంబం తల్లీ.**

"పెళ్ళి చేసుకోకపోతే ఎలాగురా? వంశం ఏమైపోతుందిరా. ఎప్పటినుంచో వస్తున్న పరంపరా ఇది."

"ఏం పరంపరమ్మా. వీటితోనే మానవజాతి చర చర పెరిగిపోతోంది. కొన్నిటికి ఫుల్‌స్టాప్ పెట్టాలమ్మా. "

"ఏమిటా అర్థంలేని ప్రలాపాలు. మీ నాన్న దగ్గిర ఉంది మన వంశవృక్షం. చూడు ఎలాంటి వాళ్ళు జన్మించారో. మహా పురుషులు పుట్టిన వంశంరా"

"మహర్షులు పుట్టిన దేశంలో మహాపురుషులు పుట్టక ఏం చేస్తారమ్మా. అయినా ప్రతిపురుషుడూ మహా పురుషుడు కావాలంటే ఎలా?"

"ఈ సోదంతా ఏమిట్రా. నేను కోడల్ని చూచుకో అక్కర్లా. మనుమల్ని ఎత్తుకో అక్కర్లా. వంశం ప్రతిష్టతో ముందుకు పో అక్కర్లా"

"అమ్మానీ మాటలకు ఎంతో చింతిస్తున్నానమ్మా. కాలం మారిందనే విషయం కూడా గుర్తించకపోతే ఎలా చెప్పు. నాన్న సగం చదువుకున్నాడు. నువ్వు కేవలం నిశానీదారువి. ప్రపంచం సంగతి ఎలా తెలుస్తుందమ్మా. నిండిర్ విల్లీ అనే మహానుభావుడు ఎప్పుడో వ్రాశారు. "ప్రపంచమంతా ఒకే కుటుంబం" అనే గ్రంథం."

"ఎవరో ఏదో వ్రాస్తూనే ఉంటారు. చేతులో కలం ఉంటే వ్రాతలకేం? డబ్బుంటే అచ్చుకూడా పడతాయి. నోబోటిగాళ్ళు కాలక్షేపంకోసం ఆ పిచ్చాపాటి చదువుతుంటారు. ఆ విల్కీకి మన వంశ మర్యాద లేం తెలుస్తాయిటా. అసలే దేశం ఆయనది? "

"ఏం తిడుతూ ఉత్తరం వ్రాయిద్దామనా. చాలా దూరంలే. ఇంతకీ నేను సినిమాకు వెళ్ళాలి. మాటలో పెట్టావు. "

**రూపాయిలోనుంచి పాపాయిల్లోకి వెళ్ళావు.**

"అయినా ఇదేమిటి? రూపాయి కావాలని ప్రారంభించి, పాపాయిలదాకా వెళ్ళావు. రూపాయలు సంపాదించాలి తప్పదు. పాపాయిల మాత హుళక్కి. ఈ సాంబశివరావుకి సంతాన ప్రాప్తిలేదు. విచారపడకు. నీకు అంతగా పిల్లల్ని పెంచాలనే వాంఛ తీవ్రంగా ఉంటే పిల్లల్ని పెంచలేని బీదవాళ్ళు చాలామంది ఉన్నారు. ఇద్దరు ముగ్గుర్ని తెచ్చి ఇంట్లో దించుతాను. చక్కగా పోషించు. నీ పేరూ, బొమ్మా పత్రికల్లో పడతాయి. ఆ బీద పిల్లలు ఇంత అన్నం తింటారు? "

"బాగానే ఉంది. పరాయి వాళ్ళను పెంచితే నా వాళ్ళు అవుతార్రా. శాస్త్రం చెప్పినట్లుంది నీ సలహా. వాళ్ళు నన్ను అమ్మ అంటారా! బామ్మ అంటారా?"

"ఎందుకు అనరమ్మా. ప్రతి రోజూ వాకిట్లోకి ఎంతమంది బీదవాళ్ళు వచ్చి "అమ్మా బిచ్చం అమ్మా కాస్త అన్నం" అని అరవడంలా. నువ్వు వినిపించుకోవడంలేదు. కావాలంటే వాళ్ళచేత 'బామ్మ' అనికూడా పిలిపిస్తాను. ఇంకా నువ్వు పట్టుబడితే మన ఇంటి పేరు వాళ్ళక్కూడా పెడతాను. ఏం? సంతోషమేనా? "

"నాకేం అక్కర్లేదులే. కడుపున కాయకాసింది. ఆ కాయలో నుంచి మరి కొన్ని కాయలు కాయాలి. వీటి తీపి బయటి వాటికి ఉంటుంది్రా. 'మన' అనే మాట మరొకళ్ళను చూస్తే వస్తుందా.? "

"రానంతవరకూ మనం నిజమైన దేశభక్తులం కాదమ్మా. మనకిలాటి స్వార్థాలుండబట్టే - ప్రభుత్వం ఎక్కువగా సిరిని తీసుకుని తక్కువ ఉన్న వాళ్ళకు పంచుతున్నారు. అంతే అవుతుంది మన పనికూడా."

"ఇదంతా మీ నాన్న స్వార్జితం. ఎలా తీసుకుంటారు. నేనీ ఇంట్లో అడుగుపెట్టిన తర్వాతనే ఇంత సిరి కలిసి వచ్చింది. నే వచ్చిన మూడేళ్ళలో ఈ మేడ కట్టారు మీ నాన్న. అంతకు ముందేం ఉంది - అద్దె కొంపేగా. "

"అదే నయం ఈ మేడకంటే. అది సరేగాని మేడ ఎలా కట్టారమ్మా నాన్న? ఆ రహస్యం కొంచెం చెప్పగలనా? ఎవరితో చెప్పనులే సంసారం విషయాలు ఈ సాంబశివరావు కూడా తెలుసుకోవచ్చుగా. మీ అబ్బాయినేగా. "

"అందరూ ఎలాకట్టారో ఆయనా అలాగే కట్టారు. ఇటికతో సున్నంతో. "

***<u>ఇటుకా, సున్నం ఎలా వచ్చెనో చెప్పగలవా.</u>***

"నీ జవాబు బాగానే ఉంది మాతా. కానీ ఆ ఇటుకా, సున్నం ఎలా వచ్చెనో చెప్పగలవా? " అని సాంబశివరావు గంతులు వేస్తూ పాట పాడటం ప్రారంభించాడు. తల్లి ముఖం చిట్లించుకుని వింటోంది

"సినిమాలలో పాటలు తప్ప కృష్ణా రామా చేతకావు. ఏం లాభం? ఎక్కడన్నా ఉద్యోగం సంపాదించుకోరా అంటే వద్దంటావు. దేశసేవ అంటావు. ఇంత పెద్ద దేశానికి చిన్న కుంకవు నువ్వేం సేవ చేస్తావు? నువ్వు చెయ్యకపోతే ఆగుతుందా?"

"సేవ చెయ్యలేకపోయినా, ద్రోహం మాత్రం చెయ్యను తల్లీ! నన్ను కృష్ణా రామా అనుకోమంటున్నావా? మన ఇంట్లో ప్రతి ఇటుక రాతిమీద పాండురంగడు వచ్చి నిలబడతాడనుకుంటున్నావా? నన్ను కన్న సాధ్వీమణి. మన్నించు. నా చేత ఇంకా మాట్లాడించు. ఈ కుటుంబాన్ని ఇంతటితో ఆగిపోనీ. నేను మాత్రం పెళ్ళిచేసుకోను. నడిచిపోతాను ఏ హిమాలయాలకో. ఎవరన్నా "మీరెవర"ని అడిగితే భారతీయుణ్ణి అని చెప్పుకుంటాను. దొరికితే ఎక్కడన్నా రెండు మెతుకులు తింటాను. లేకపోతే వస్తుంటాను. నా అంతవాణ్ణి నేనుగా స్వంతంగా నవయుగ పౌరుడుగా జీవించాలనుకుంటున్నాను మాతా. నాన్నలాగా బ్రతకలేను. ఈ మేడకు మరో అంతస్తు వెయ్యలేను. నేను సినిమాకు వెడుతున్నా. అదృష్టవశాత్తు "నా అంతవాణ్ణి నేను" అనే ఫిలిం వచ్చింది చూచివస్తా"

"రూపాయి మాటేమిటిరా"

"నాన్ననడగవమ్మ. ఆయన ఎందరినో అడిగి తెచ్చిన డబ్బు ఎంతో ఉంది. "

"గుళ్ళో కొబ్బరికాయకొట్టాలిరా. మీనాన్న వచ్చేసరికి ప్రొద్దుపోతుంది. "

"కోటి కొబ్బరి కాయలు కొట్టినా చేసిన పాపం తీరుతుందని నమ్మకం లేదమ్మా. వస్తా. ఆరుదాటింది. "

"నా అంతవాణ్ణి నేను - టా..టా. "

Comment on this article..